కంటి మెరుపు

మధ్యాహ్నం ఒంటిగంటయింది. రిక్షావాళ్ళు పదిమంది రిక్షాలల్లోనే కాళ్లు ముడుచుకుని పడుకుని బాలమ్మకోసం ఎదురుచూస్తున్నారు. ఒకళ్ళిద్దరులేచి ఆకలికి ఆగలేక సోడాకొట్టువాడి నడిగి నీళ్లు తాగి వచ్చారు. మిగతావాళ్ళు ఉస్సూరంటూనే ఆమెకోసం ఎదురుచూస్తున్నారు. నెత్తిమీద గంపపెట్టుకొని వచ్చింది బాలమ్మ. ఒక్కొక్కళ్ళే రిక్షాలలోనుంచి లేచి "ఇంత ఆలస్యం చేసావేం ఇవాళ" అని ప్రశ్నిస్తూ గంప దించి ఎవరి పొట్లం వాళ్ళు అందుకోవటం మొదలుపెట్టారు. రంగడు మాత్రం ఆమె ముఖంలోకి చూస్తూ "ఏంది? ఏడ్చినట్టున్నవు. కళ్ళు ముఖం వాచినాయి" అంటూ ఆమె ముఖంలోకి చూశాడు.

బాలమ్మ కొంగు ముఖాని కడ్డం పెట్టుకుని మళ్ళీ వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఏంది? మామూలు సంగతేనా?" అడిగారు తింటూతింటూ ఉన్న రిక్షావాళ్లు నలుగురు.

వాళ్ళందరికీ బాలమ్మ యింటి సంగతులు తెలుసు. బాలమ్మమగడు మంచంలోనుంచి లేవలేడు. రెండిళ్ళల్లో పాచిపని చేసి ఇంటికి వచ్చి పిల్లలకు, తండ్రికి వండిపెడుతుంది బాలమ్మ. కాని – ఆమె తెచ్చే జీతం, ఆ యింటి ఆ యింట మిగిలిన అన్నం కూరలు ఒక్కరి కయినా చాలవు. ఒకనాడు బజారులో తారసపడ్డ ఆమె ఊరివాడు గంగయ్య రిక్షావాళ్ళకు అన్నం వండి తీసుకువస్తే మనిషికి రూపాయి యిప్పిస్తా నన్నాడు. ఆమె పన్నెండుగంటలకు బయలుదేరి వాళ్ళకు అన్నపుపొట్లాలు యిచ్చి రెండు గంటలకు ఇంటికి వస్తుంది. తిరిగి నాలుగు గంటలకు పాచి పని చేసుకోవటానికి వెళ్ళి ఆరున్నర ఏడు గంటలకు ఇల్లు చేరుకుంటుంది.

బాలమ్మ పెనిమిటి వెంకటేశు ఆరోగ్యం బాగున్న రోజుల్లో బట్టలమిల్లులో పనిచేసేవాడు. తెచ్చిన జీతంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. అకస్మాత్తుగా వచ్చిన జబ్బుతో మంచానపడ్డాడు. మిల్లు వారిచ్చిన డబ్బుతో కాలువ దగ్గర కొద్ది

స్థలం కొనుక్కుని చిన్న పాక వేసుకున్నాడు. వెంకటేశు మొదట మొదట బాలమ్మ పాచిపని చేయటం ఇష్టం లేకపోయినా గత్యంతరంలేక ఒప్పుకున్నాడు. అతడికి బాలమ్మ ఏ ఇంట ఎంతసేపు పనిచేస్తుందో అంచనావేసే శక్తి ఉన్నది. పదినిమిషాలు ఆలస్యమయితే నిలబెట్టి కారణమడుగుతాడు. రిక్షావాళ్ళకు పొట్లాలందించితే ఆదాయం బాగా ఉంటుందని బాలమ్మ చెప్పినప్పుడు వెంకటేశు మంచంలో ఉండే మర్దనచేశాడు.

"ఎందుకు చెయ్యి చేసుకుంటావు? పైస లొస్తుంటే చేదా? మనకు రెండు పూటలా తిండిగడవాలా వద్దా?" దెబ్బలు తగిలినచోట చేత్తో తడుముకుంటూ అరిచింది బాలమ్మ.

"అవునే - తెలుసు. రెండుపూటలా తిండి కడుపులో పడితే వెర్రి వెర్రి ఊహలు పోతాయి మనసులో. నీవింక పని కాగానే ఇంటికి వస్తావా?" కసిగా పళ్ళు కొరికాడు వెంకటేశు.

"ఎందుకు రాను?" ముఖం తుడుచుకొని శాంతించింది బాలమ్మ.

రెండు నెలలు రిక్షా వాళ్ళకు అన్నపు పొట్లాలు అందించిన తరువాత వెంకటేశు ముఖంలో జీవకళ కనబడటం మొదలుపెట్టింది. పిల్లలిద్దరూ కాస్త నున్నపడ్డారు. పెద్దవాడికి ఒక పని కల్పించింది బాలమ్మ. సాయంత్రం ఆరుగంటలు కాగానే ఒక లీటరు కిరసనాయిలు తీసుకుని పేవ్‌మెంటుమీద ఒక దీపం పెట్టుకుని కూర్చుంటే రిక్షావాళ్ళందరూ అక్కడికి వచ్చి చమురు పోయించుకుని వెళ్ళేవారు. ఒకలీటరు కిరసనాయిలుకు పెట్టిన ఖర్చుతో ఒకటిన్నర లీటరు కొనటానికి తగిన ఆదాయము వచ్చేది.

బాలమ్మ పాచిపని చేసే ఇళ్లల్లో ఇచ్చిన చీరెలు కట్టుకునేది - కాని రిక్షావాళ్ళకు అన్నపు పొట్లాలు ఇవ్వటం మొదలుపెట్టిన తరువాత ఆ చీరెలు ఇంట్లో కట్టుకోవటానికి ఉంచుకున్నది. పాతచీరెలు అమ్మే అంగడిలో రెండు ప్రింటు చీరెలు కొనుక్కుని వాటిని జాగ్రత్తగా ఇంటికి రాగానే మడతవేసి పెట్టుకునేది. వెళ్ళేటప్పుడు ముఖం కడుక్కుని బొట్టు దిద్దుకుని వెళ్ళేది. ఒక్కొక్కనాడు బాలమ్మ తిరిగి వచ్చేటప్పటికి నోటినిండా తమలపాకూ తలనిండా పూలు ఉండేవి. ముఖం కళకళ లాడుతూ ఉండేది.

వెంకటేశు ముఖం ఆమెను చూడగానే నిప్పులు చెరిగేది. అతడికి బాలమ్మ తనకు పరిచయమైననాటి పరిస్థితులు పదే పదే జ్ఞాపకానికి వచ్చేవి

ఇరవై సంవత్సరాలు నిండీ నిండని బాలమ్మ పూచిన తంగేడులా మిల్లు గేటు దగ్గర తట్ట నెత్తిన పెట్టుకుని నిలబడి ఉండేది గేటు కాపలాదారు ఆమెను చూసి కళ్ళు చికిలిస్తూ పైకి కోపంగా "నీ అటువంటి వాళ్ళను గేటు దగ్గరికి రానీయ వద్దని దొర చెప్పాడు. వెళ్లువెళ్ళు రేపటినుంచీ రాకు" అంటూ పిలవేసి మాట్లా డిస్తూ పరాచికాలు ఆడేవాడు టైము కాగానే కార్మికులు కొందరు ఆమె దగ్గరికొచ్చి పొట్లాలు తీసుకునేవారు. సింగన్న బాలమ్మను చూసినప్పటినుంచీ ఇంటినుంచి అన్నం తెచ్చుకోవటం మానేశాడు

బాలమ్మ అందరితోనూ కలవిడిగా మాట్లాడుతుంది. ప్రాణం యిస్తున్నట్టు కనబడుతుంది; కళ్ళతో కవ్విస్తూన్నట్టు ఉంటుంది. గలగల నవ్వుతుంది. కాసేపటిలో ఎదుట మనిషితో కలిసిపోతున్నట్టు ఉంటుంది. కార్మికులు ఆమె సంతోషమంతా తనను చూసేనని ఎవరికివారు అనుకునేవారు. పోటీపడి ముందుకు వచ్చేవారు. ఆ పోటీలలో తగువులు కూడా వచ్చేవి వెంకటేశు మిల్లులో పనిచేస్తుండగా వచ్చింది వాతరోగం. కాళ్ళు పడిపోయాయి. మరి పని చేయలేడు.

మిల్లుకు పొట్లాల గంప తీసుకుపోయినప్పుడు "ఇవాళ వెంకటేశు రాలే దేం?" అని అడిగిం దొకనాడు బాలమ్మ.

అతడి సంగతి తోటి కార్మికులు చెప్పారు. "పాపం! వెంకటేశుకు భార్య లేదు. ఇద్దరు పిల్లలు వండిపెట్టే దిక్కులేదు" అంటూ జాలి కలిగేటట్టు చెప్పారు. బాలమ్మ అతడి యింటి గుర్తు తెలుసుకుని వెళ్ళింది. సంగతులన్నీ అడిగి తెలుసు కుంది.

"నేనూ ఒంటరిదాననే నేను వచ్చి వండిపెడతాను. నీ పిల్లలనూ నిన్నూ బాగా చూసుకుంటాను" అన్నది.

సంతోషం పట్టలేక వెంకటేశుకు కళ్ళనీళ్లు వచ్చాయి "నిజంగానా! నిజం గానా! ఎంత మంచిదానవు బాలమ్మ? తాళి కట్టించేసుకో బాలమ్మా" అన్నాడు కళ్లు తుడుచుకుంటూ.

బాలమ్మ సంకోచించింది తనకీ పెళ్ళి వ్యవహారం బొత్తిగా నచ్చదు. ఎందరో ఎన్నిసార్లో వెంటబడ్డారు పెళ్ళిచేసుకోవలసిందని. తను ఒకరి మనిషిగా మిలిచిపోవటం ఇష్టంలేదు

"అయితే నువ్వే ఊరికే నా యింట్లో ఉండి వండిపెడుతుంటే అందరూ ఏదో ఏదో అనుకుంటారు. నా కది ఇష్టం లేదు." అన్నాడు వెంకటేశు.

"చెప్పుకో. అందరికీ తాళి కట్టానని. కాని నాకు మాత్రం ఏ తాళి వద్దు" ఖచ్చితంగా చెప్పింది బాలమ్మ.

"నీకో ఇల్లూ నీడ కావలసి వచ్చి ఇక్కడ ఉంటావా? నీ తిరుగుళ్ళంతా బయటనా?" మొదటినాడే కటువుగా మాట్లాడాడు వెంకటేశు

"నీ పిల్లలకూ నీకు కష్టం లేకుండా చూసుకుంటా చాలదా?" అన్నది బాలమ్మ.

వెంటేశు మంచంలో నుంచి లేవలేడు. మనిషి సహాయంతో మంచం దిగి జరుగుతూ తన పనులు తాను చేసుకుంటాడు. అటువంటి వెంకటేశుకు కూడా ఒక ఆడదాని మెడలో తాళికట్టి తన ఇంట్లో కట్టేసుకోవాలని ఉండటం చూసి నవ్వుకున్నది బాలమ్మ.

ఆ రోజు నుంచీ బాలమ్మ మెడలో తాళి లేకపోయినా ఆ ఇరుగుపొరుగంతా "చీరె రవిక" పెట్టిన భార్యగా జమకట్టారు. బాలమ్మ ఇరుగు పొరుగులతో అక్కచెల్లెలిగా మెలగుతూ అందరికీ సహకరిస్తూ తన పని తాను చేసుకుంటూ-వెంకటేశు అర్థంలేని కోపాలకు నవ్వే కళ్ళతో జవాబిస్తూ కాలం గడుపుతోంది.

రిక్షావాళ్ళలో నారాయణ కాస్త అందరి కంటె నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడుతాడు. అప్పుడప్పుడు పైకే అనేస్తాడు "ఆ యెంకటేశును పట్టుకుని యేళ్ళాడుతావేం? మంచోడు దొరకలా?" అంటూ ఎగతాళి చేస్తాడు.

బాలమ్మ ఆ మాటలకు పొంగినట్లే జవాబిస్తుంది. "కనబడకేం? కావలసినంతమంది! కావాలంటే నువ్వు లేవా?" అంటుంది. ఆకాశమంత ఎత్తు పొంగిపోతా డతడు.

"నిజమేనా? నిజమేనా? అయితే నన్ను మనువాడరాదూ?"

"ఆడతా! ఆడతా! రేపో ఎల్లుండో! ఆగుకాస్త" అంటూ కొంగు విడిపించుకుంటుంది.

"వెధవ నారాయణ నీ కళ్ళకు నచ్చాడా? చింపిరి జుట్టూ చింతాకంత కళ్ళు వాడూను. నా ముఖంలోకి చూసి చెప్పు" అంటాడు రంగన్న తానే అందగాడన్నట్టు. అప్పటికప్పుడు ఆ మాటమీద నారాయణకూ, రంగన్నకు తగాదా వచ్చింది. నారాయణను రంగన్న వెనక్కు తోశాడు. తలకు బాగా దెబ్బ తగిలి రక్తం కారింది. అక్కడవున్న వాళ్ళు ఇద్దరినీ విడిపించారు. నారాయణను హాస్పిటల్‌కు తీసుకువెళ్ళి కట్టుకట్టించారు. ఆ వ్యవహారం అంతటితో ముగియకుండా నరసింహ రంగంమీదికి వచ్చాడు.

"నర్సిమ్మా. నా మెడలో తాళికట్టి నన్ను నీఇంట్లో కట్టేసుకోవాలనుందా?" నవ్వింది బాలమ్మ.

నరసింహకు తాళికట్టటం మీద అంతగా నమ్మకంలేదు. మనిషి తన వశమైతేచాలు. "పోనీ—తాళి కట్టనులే" అన్నాడు "వస్తావా?" అని కళ్ళతో అడుగుతూ.

"రావాలా?" కవ్వించింది బాలమ్మ.

కొంగు ఒడిసి పట్టాడు నరసింహ.

కొంగు లాక్కుని కిలకిల నవ్వుతూ పారిపోయింది.

నగరంలో ఆ బజారు చాలా రద్దీగా ఉంటుంది ఎప్పుడూ ప్రజానీకం నడపటానికి ఫుట్‌పాత్‌లు ఈ మధ్యనే రోడ్డు కంటె జానెడు ఎత్తుచేసి నాపరాళ్ళు పరచారు. వీధులలో అక్కడక్కడ నాటిన నీడ ఇచ్చే పెద్ద చెట్లవల్ల ఆ వీధిలో ఫుట్‌పాత్ ఎప్పుడూ అరమైలు దూరం వరకూ చల్లగా ఉంటుంది. ఆ ఫుట్‌పాత్ మీద చిన్న తమలపాకు బీడీల దుకాణం పెట్టాడు యాదగిరి. అతడికి మునిసిపల్ కౌన్సిలర్ రెడ్డి మద్దతు బాగా ఉంది. అతడే ఆ కొట్టు పెట్టించాడు. రెడ్డిని గెలిపించింది నిజంగా యాదగిరే అందుకే యాదగిరి ఏ పని చేసినా పోలీసు వారికి ఆక్షేపణలేదు. పైగా దణ్ణాలు పెడుతూ ఉంటారు. ఆ దారిన వచ్చినప్పుడల్లా

యాదగిరి బాలమ్మకు తమలపాకు బీడా మసాలా వేసి ఇస్తాడు. ప్రక్క కొట్లో మల్లెపూల దండ ఇప్పిస్తాడు. కాఫీ పిల్లవాడు వస్తే కాఫీ ఇప్పిస్తాడు. కడుపు నిండేటట్టు కబుర్లు చెబుతాడు. ఆశతో కళ్ళల్లోకి చూస్తాడు.

విరగబడి నవ్వుతుంది బాలమ్మ.

"మా కవున్సిలర్ రెడ్డిగారు మామంచివోరు ఎప్పుడయినా వొస్తారు చూస్తావా?" అన్నాడు.

"చూడకేం? మంచి వాళ్ళంటే నా కిష్టం. ఆయన గారొచ్చినప్పుడు నన్ను పిలు. అటువంటి వాళ్లంటే నాకిష్టం" ఉత్సాహం కనబరచింది బాలమ్మ.

యాదగిరి పిలపనంపగానే రెడ్డి పుక్కిటి మసాలా బీడా - పెదవుల మధ్య చార్‌మినారు సిగరెట్టు- తెల్లటి ఖద్దరు బట్టలు- వచ్చాడు. ఎక్కడినుంచో యాదగిరి ఒక కుర్చీ తెప్పించి నీళ్ళు చల్లించి వేయించాడు.

ఆరుగంటలవేళ- పెద్ద పువ్వుల నైలాను చీర కట్టుకుని మంచి రైక తొడుక్కుని తలనిండా పూలతో నొక్కుల జుట్టు సింగారింపులో ఒయ్యారంగా నడుస్తూ వచ్చింది. బాలమ్మలోని చలాకీతనం రెడ్డిని తబ్బిబ్బు చేసింది

చూడగానే సరుకు బాగానే ఉందని తృప్తిపడ్డాడు. రెడ్డి యాదగిరి వాళ్ళిద్దరికి గోల్డుస్పాట్ తెప్పించి యిచ్చాడు. స్టూలుమీద కూర్చున్న బాలమ్మ సంబర పడుతూ తాగింది. రెడ్డి తాంబూలం ఆమె చేతికిస్తూ చెయ్యిగిల్లాడు. యాదగిరి మల్లెపూల దండలు రెండు తెప్పించి రెడ్డికొకటి బాలమ్మకొకటి ఇచ్చాడు.

బాలమ్మ ఎప్పుడూ పూలు చూడని దానికి మల్లే ఆ మల్లెదండ అందుకుని ఆత్రంగా తలలో తురుముకుంది.

"రేపు గండిపేట పోదామనుకుంటున్నా. ఒక జీపుకూడా వస్తుంది." అన్నాడు రెడ్డి. బాలమ్మను రమ్మని-యాదగిరితో చెప్పించాలని.

"నేనెప్పుడూ అటువంటివి చూడలేదు. రేపే వేళకు రానా?" అన్నది మురిపెంగా బాలమ్మ.

"అయ్యో! నీ కోసమే ఇదంతా మా రెడ్డిగారంత ఉత్సాహం కలవారు లేరనుకో" అన్నాడు యాదగిరి.

బాలమ్మ చూస్తూ ఉండగానే రెడ్డి సైకిలు ఎక్కి వెళ్ళిపోయాడు.

ఇంకా అట్లాగే నిలబడిఉన్న బాలమ్మను యాదగిరి "ఏమన్నా రూపాయలు కావాలా? సందేహించకు" అన్నాడు.

"సగం చచ్చి అడుగుతున్నాననుకో యాదగిరి. గుడిసె తాకట్టు విడిపించు కోవాలి. రెండు మంచి కోకలు కొనుక్కోవాలి. గుడిసెకు రేపటితో వాయిదా చెల్లవుతుంది. ఆ అరబ్బువాడు ఆగేటట్టులేదు. పైగా రెండుసార్లు చెయ్యి గుంజాడు. రేపు బయలుదేరాలంటే మంచి కోకలేదు. ఇది అద్దె దనుకో" ఏడుపు గొంతుతో అన్నది

యాదగిరి గుండె కదిలిపోయింది సొరుగులోనుంచి ఏభయి రూపాయలు తీసియిచ్చాడు. రెడ్డి వాడిన సరుకును తాను కూడా వాడుతూ ఉంటాడు యాదగిరి. నష్టమేముంది అన్నట్టుగా ముందుగా డబ్బిచ్చాడు బాలమ్మకు. అతడికి గట్టి ధైర్య ముంది రెడ్డి దగ్గరినుంచి ఇబ్బడి గుంజవచ్చని.

యాదగిరి ఇచ్చిన యాభై రూపాయలు సంచిలో పెట్టుకుని రొంటిన దోపు కున్నది బాలమ్మ. తిరుగుముఖమవుతూ ఆలోచిస్తూ నవ్వుకుంటూ అడుగులు వేస్తు న్నది. "రాజాంతఃపురాలు ఇప్పుడు లేవు. అతివలు అంతఃపురాలలో ఉండటం మానే శారు. పరదాలు చిరిగిపోయాయి. అప్పుడు వారి కాపలాకు తయారుచేసిన ఈ కొజ్జా సమూహమంతా ఏం కావాలి? పురిటింటికి వెళ్ళితే ఇదివరకు నాలుగేసి రూపాయలు ఇచ్చేవారు ఇప్పుడా ఆదాయం కూడా తగ్గింది. ఈ సమూహానికి బ్రతుకు తెరవేమిటి? మగవాళ్ళను మురిపించటమే ఆటగా నలుగురయిదుగురు మాత్రం హాయిగా బ్రతుకుతున్నారు. మిగతా వారికి తిండికి కూడా కరువుగా ఉంది. వాళ్ళకీ ఏభయి రూపాయిలిస్తా—రేపటి కింకొకడు దొరకడా నా బుట్టలో పడటానికి?" చరచర అడుగులు వేసింది బాలమ్మ—అదే ఒకప్పటి హుసేను.

(అనామిక-మాస పత్రిక)